క్లుప్తంగా

ప్రణాళికతో చదవండి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో విజయం సాధించాలని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. సత్తుపల్లి ప్రభుత్వ గిరిజన బాలికల హాస్టల్‌లో ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే సిలబస్ పూర్తిగా చదవాలని, ఏకాగ్రతను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి బి.రాములు, ట్రైనర్ కొచ్చర్ల శ్రీనివాసరావు, హెచ్‌ఎం యాకొబ్, డాక్టర్ రామదాసు, రాజా, మాధవి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రంగులు

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఇండిగో పెయింట్ డీలర్ లగడపాటి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఇండిగో పెయింట్స్ సహకారంతో ఆదివారం సొంత ఖర్చులతో రంగులు వేయించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రాజు, ఎంఈఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇండిగో పెయింట్ డీలర్ తిరుపతిరావును, మేనేజర్ సాగర్‌ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పాఠశాలకు ఉచితంగా రంగులు వేసిన పెయింటర్స్ యూనియన్ కు అభినందనలు తెలిపారు.

గ్రామానికి బస్సు సౌకర్యం

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్తులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశారు. ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆదివారం బస్ సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిదంగా లక్ష్మీపురం వరకు బస్ సర్వీసును పొడిగించాలని కోరడంతో సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమ్మినేని బాబు, రమేష్, కల్యాణపు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో మాక్ ఈఏపీ సెట్

సత్తుపల్లిరూరల్:గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాల స్థాయిలో ఇంటర్ విద్యార్థులకు మాక్ ఈఏపీసెట్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్, ప్రిన్సిపాల్ వి.శేషారత్నకుమారి, కోకన్వీనర్ రామకృష్ణ, ప్రసాద్, యాకూబ్, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతకాని: మండలంలోని నాగిలిగొండ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల వలన ఫీడర్ పరిధిలో ఉన్నటువంటి నాగిలిగొండ, ప్రొద్దుటూరు, కోమట్లగూడెం గ్రామాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం

మెడిసిన్ విద్యార్థినికి రూ.97 వేలు..



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న రామారావు

కల్లూరు: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన మేకల మోహన్‌రావు కుమార్తె సంధ్య హైదరాబాద్ కామినేని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రైవేట్ కళాశాలలో ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు ఫౌండేషన్ ద్వారా దాతలను సంప్రదించారు. దీంతో స్పందించిన దాతలు వరకా రామారావు ద్వారా సంధ్యకు రూ.97 వేల చెక్కును ఆదివారం అందించారు. ఫౌండేషన్ దాతలకు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి రూ.10 వేలు..

ముదిగొండ: మండలంలోని వల్లభి‌కి చెందిన పోనపు రాంబాబు కుటుంబానికి భక్తరామదాసు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చైర్మన్ పోట్ల వెంకటప్రసాద్‌రావు, మాజీ సర్పంచ్ పోట్ల కృష్ణకుమారి ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. భక్తరామదాసు సొసైటీ నుంచి ప్రతి ఏటా నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ సభ్యులు బిచ్చాల ధనమూర్తి, కొండ విజయభాస్కర్‌రావు, ఏడుకొండలు, వెంకటరమణ, పోట్ల రవికుమార్, ఏనుగుల బాబు పాల్గొన్నారు.

ఈ వేదన తీరేదెన్నడో..?

- ఒకే భవనంలో రెండు గురుకులాలు
- విద్యార్థినులకు సరిపోని భవన సామర్థ్యం
- అరకొర వసతులతో ఇబ్బందులు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అన్ని వసతులతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తామని పాలకులు చెబుతున్నారు. ఇంత వరకు ప్రభుత్వ పనితీరు, అధికారుల హామీలు బాగున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న గురుకుల పాఠశాలలకు భవనాల కేటాయింపు, మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల వేదన ఎప్పుడు తీరుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.



రెబ్బవరంలో రెండు గురుకులాలు నిర్వహిస్తున్న భవనం

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామంలో ఒక అద్దె భవనంలో రెండు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వాహణ సాగిస్తున్న నేపథ్యాన అరకొర మౌలిక వసతులతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కానీ.. అధికారులు తాత్కాలిక భవనం చూసి విద్యార్థులను తీసుకెళ్తామని చెప్పినప్పటికీ.. ఇప్పటి వరకు కార్యచరణ జరగకపోవడంతో గత్యంతరం లేక విద్యార్థులు అందులోనే విద్యను కొనసాగిస్తున్నారు.

మొదలైన గురుకులాల ప్రస్తావన..

వైరా మండలం రెబ్బవరం గ్రామానికి 2017లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు కాగా, అప్పటి ప్రభుత్వ అధికారులు నూతనముసలిమడుగులో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొన్ని కారణాల చేత భవనాన్ని నిర్మించకుండా వదిలేశారు. దీంతో బీసీ వెల్ఫేర్‌ను ఆరు నెలల పాటు కారేపల్లిలో కొనసాగించి తర్వాత వైరాలోని.. రెబ్బవరంలో మూతబడిన ప్రైవేట్ పాఠశాల భవనాన్ని అద్దెకు తీసుకోని నిర్వహణ సాగిస్తున్నారు. ఇక్కడ 6 నుంచి 10తరగతుల వరకు విద్యాబోదన జరుగుతుంది. రెండేళ్ల కిందట వైరా పట్టణ కేంద్రానికి మహాత్మా జ్యోతిబా పూలే వెల్ఫేర్ రెసిడెన్షియల్ మంజూరైంది. కానీ భవన నిర్మాణానికి సరైన స్థలం లేకపోవడంతో జిల్లా అధికారుల సూచనల మేరకు ముసలిమడుగు, వైరా ఎంజేపీటీలను రెబ్బవరంలో కొనసాగిస్తున్నారు.

భవన కేటాయింపులో అలసత్వం..

రెండు గురుకులాలు కలిపి సుమారు 700 మంది విద్యార్థునులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఆరు నెలల కిందట విద్యార్థుల తల్లిదండ్రులు వైరా–జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారిపై ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించడంతో పాటు.. స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కలిసి సమస్యలపై వినతి అందించారు. దీంతో అధికారులు, నాయకులు సానుకూలంగా స్పందించినా ఇంత వరకు భవన కేటాయింపు మాత్రం జరగలేదు.

రెండు గురుకులాల విద్యార్థులు ఇలా..

రెబ్బవరంలోని ప్రైవేట్ భవనంలో ముసలిమడుగు, వైరా మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల నిర్వాహణ సాగుతోంది. ముసలిమడుగు ఎంజేపీటీ బాలికల గురుకులంలో 6 నుంచి 10వ తరగతి వరకు 404 మంది విద్యార్థినులు ఉండగా.. వైరా ఎంజేపీటీలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సుమారు 296 మంది విద్యార్థినులు ఉన్నారు. రెండు గురుకులాల మీద సుమారు 700 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరందరికీ భవనం ఆవరణలో 21 మరుగుదొడ్లు, 11 స్నానపు గదులు, ఒక్కనీటి పంపు(మోటార్) మాత్రమే ఉండడంతో పాటు.. సరిపడా మంచాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


గురుకులంలో అరకొరగా ఉన్న స్నానపు గదులు

నివేదిక ఇచ్చాం..

తాత్కాలికంగా ఖమ్మంలోని దేర్ ఇంజనీరింగ్ కళాశాలలో భవనంలోని కొన్ని గదులను పరిశీలించి ఎంజేపీటీ గురుకుల కార్యదర్శికి నివేదిక ఇచ్చాం. ఆయన అనుమతి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రెబ్బవరంలో కొనసాగుతున్న వైరా గురుకులంలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను తాత్కాలికంగా ఆ భవనంలోకి తరలించి సమస్యను పరిష్కరిస్తాం.

– సీహెచ్.రాంబాబు, ఆర్‌సీఓ, ఖమ్మం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మధిర: 40 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థినులు


కొణిజర్ల: తనికెళ్ల పాఠశాలలో..

మధిర: మధిర పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్‌లో 1984–85 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థినులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయినులు అరుణ, సత్యవేదం, సరోజిని, అభేదా తదితరులను ఘనంగా సన్మానించారు. నాటి గురువులతో కలిసి తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు. 40 సంవత్సరాల తర్వాత స్నేహితులు ఒకచోటకు చేరి రోజంతా సంతోషంగా గడపడం అభినందనీయమని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని హైమావతి తెలిపారు.

కొణిజర్ల, తనికెళ్లలో..

కొణిజర్ల: మండలంలోని కొణిజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల 2006–07 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కొణిజర్ల సమీపంలోని ఇండోఖతార్ వెంచర్‌లో కలుసుకున్నారు. అదే విధంగా తనికెళ్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1991–92 బ్యాచ్ విద్యార్థులు.. పాఠశాలలో ఆదివారం కలుసుకొని ఒకరినొకరు పలకరించుకున్నారు. అలనాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తనికెళ్ల పూర్వ విద్యార్థులు విద్యాసాగర్, వెంకటేశ్వర్లు, మంగపతి, సిరియాల్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సరస్వతి, రేవతి, శ్రీలత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో భట్టి, పొంగులేటి పర్యటనలు

డిప్యూటీ సీఎం భట్టి పరామర్శ..

బోనకల్: ఇటీవల ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో మృతి చెందిన బోనకల్ గ్రామానికి చెందిన యార్లగడ్డ వరమ్మ కుటుంబాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాయపడిన వారి వివరాలను తెలుసుకోని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గాలి దుర్గారావు, పైడిపల్లి కిశోర్, కర్నాటి రామకోటేశ్వరావు, మరీదు శ్రీను తదితరులున్నారు.

కాబోయే వధూవరులకు ఆశీర్వాదం..

మధిర: స్థానిక వర్తక సంఘం కల్యాణ మండపంలో మధిర పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరమణ గుప్తా, లావణ్య దంపతుల కుమార్తె సాత్విక, వరుడు స్వరాజ్ రంగ నిశ్చితార్థ వేడుక జరగ్గా.. వారిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సతీమణి నందిని ఆశీర్వదించారు.

సోదరుడు మల్లు వెంకటేశ్వర్లకు నివాళి..


వెంకటేశ్వర్లు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వైరా: వైరాలో తన సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి భట్టి విక్రమార్క హాజరై వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వరరావు, వైరా మాజీ మున్సిపల్ చైర్మన్ జైపాల్, నాయుడు సత్యం, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పరామర్శ..

తుంబూరు భారతికి నివాళి..


భారతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ విజయబాబు

సత్తుపల్లి: మండలంలోని సదాశివునిపేట సీనియర్ కాంగ్రెస్ నేత తుంబూరు ప్రతాప్‌రెడ్డి సతీమణి భారతి మృతి చెందటంతో ఆ కుటుంబాన్ని ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, డాక్టర్ మట్టా దయానంద్‌లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా కాలినేని రాజేష్ తల్లి కుమారిని పరామర్శించారు. కార్యక్రమంలో ముత్తారెడ్డి, రాజేష్, సుజలరాణి, మహేష్ ఉన్నారు.

వేంసూరు: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బోళ్ల నరసింహారావు మాతృమూర్తి సావిత్రి ఇటీవల మృతి చెందిగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డాక్టర్ మట్టా దయనంద్, కాంగ్రెస్ నాయకులు వేణు, సుబ్బారావు, రమేష్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

మట్టూరికి నివాళి..

కల్లూరు: జిల్లా సీపీఎం సీనియర్ నాయకుడు మట్టూరి భద్రయ్య స్తూపం వద్ద పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం సాయంత్రం ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, డాక్టర్ మట్టా దయానంద్, మట్టూరి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మేదారాణికి..

వైరారూరల్: మండలంలోని విప్పలమడక గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మేదారాణితో చిత్రపటానికి పొంగులేటి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురి అనారోగ్య బాధితులను పరామర్శించారు. అనంతరం గన్నవరం గ్రామంలో పర్యటనలో ఉన్న మంత్రిని గొల్లపూడి గ్రామస్తులు కలిసి ఏళ్లుగా సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, వైరా మున్సిపల్ మాజీ చైర్మన్ జైపాల్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, విజయబాయి, వెంకటనర్సిరెడ్డి, సైదులు, రహీం తదితరులున్నారు.

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్


సత్తుపల్లిలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైందని రైతులకు, పేదలకు, కార్మికులకు అన్యాయం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లిలో ఆదివారం ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ అధ్యక్షులు కొలికపోగు సర్వేశ్వరరావు, కుమారస్వామి, వెంకటేశ్వరరావు, వలీ, రామకృష్ణ, జిలాని, నబి, బడేమీయ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ శ్రేణుల నిరసన..

కల్లూరు: కేంద్ర బడ్జెట్‌పై కల్లూరులో కాంగ్రెస్ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ నీరజ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చందర్‌రావులు మాట్లాడారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శ్రీను, నరసింహారావు, కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, కాంతారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

మధిర/బోనకల్/చింతకాని/ముదిగొండ: కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా మధిరలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద, బోనకల్ సెంటర్‌లో, చింతకానిలో, ముదిగొండ ప్రధాన సెంటర్‌లో సీపీఎం నాయకులు నిరసన తెలిపి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఆ పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, సీపీఎం మండల కార్యదర్శులు రాచబంటి రాము, బట్టు పురుషోత్తం, నాయకులు నాగేశ్వరరావు, సురేష్, కోటేశ్వరరావు, శ్రీను, జానికిరాములు, కృష్ణమూర్తి, ఉపేందర్, కోటేశ్వరరావు, వెంకన్న, దామోదర్, భద్రయ్య, ఉపేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

- కారేపల్లి: సీపీఎం సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను ఆదివారం కారేపల్లిలో దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో రామారావు, ఏకాంబరం, వెంకటేశ్వర్లు, రవి, శోభన్, ఉపేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు వినతి

వైరా: రిటైర్డ్ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ ఆదివారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చారు. వైరాలో కార్యక్రమానికి హాజరైన భట్టిని కలిసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆయనతో మాట్లాడుతూ.. జీఓ నంబర్ 186ను సవరించి రాష్ట్రస్థాయిలో రిటైర్డ్ ఉద్యోగుల కోసం ట్రస్ట్ ఏర్పాటు చేసి నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఉన్న ఎస్‌టీఓ కార్యాలయం తమకు అందుబాటులో లేనందున ఖమ్మం నగరంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి ఎస్‌టీఓ కార్యాలయాన్ని మార్చాలని కోరారు. దీనిపై భట్టి స్పందిస్తూ రాష్ట్ర స్థాయిలో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు పైడిపల్లి శరత్, కల్యాణం కృష్ణయ్య, సత్యనారాయణ, కృష్ణయ్య సూరి, పెంటయ్య, వాసుదాస్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణ


కమలాపురంలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో ఆదివారం ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మధిర సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు షేక్ మౌలానా ముజాహిద్ ఆధ్వర్యాన సభ్యత్వ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిగొండ మండలానికి షేక్ మహమ్మద్ అజ్గర్‌ను మధిర ముస్లిం ఐక్య సంఘం సలహాదారుడిగా ఏకగ్రీవంగా నియమించారు. ఐక్య సంఘం అధ్యక్షుడిగా షేక్ మహబూబ్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ రెహమాన్, జనరల్ సెక్రటరీగా షేక్ తాజుద్దీన్ బాబా, సెక్రటరీ సలావుద్దీన్, ట్రెజరరీ ఖాసీం, కమిటీ సభ్యులు పాషా, సత్తార్‌మియా, నాగులుమీరా, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సండ్రను విమర్శించే స్థాయి లేదు

కల్లూరు: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. కల్లూరులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు, కాటమనేని వెంకటేశ్వరరావు, రావి సూర్యనారాయణ, నందిగామ ప్రసాద్, మేకల కృష్ణ, ఎస్‌కే కమ్లి, కొరకొప్పు ప్రసాద్‌లు మాట్లాడారు. మూడు పర్యాయాలు ప్రజాబలంతో ఎమ్మెల్యేగా గెలుపొందిన సండ్ర వెంకటవీరయ్య ఈ నియోజకవర్గం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మల్లేశ్వరరావు, వెంకటరత్నం, కిరణ్, రావూఫ్, వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్ షుగర్, బీపీ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఆహారపు నియమాలను పాటించడం ద్వారా బీపీ, షుగర్‌ను కంట్రోలు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్, యంగల ఆనందరావు, ఆకెన పవన్ పాల్గొన్నారు.

పినపాకలో..

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో ఆదివారం ఖమ్మం మెట్రో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వందమందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పరికల రాము గౌడ్, డాక్టర్ జంగం సాయిచరణ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, కృష్ణార్జున్ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు మట్టూరి

కల్లూరురూరల్: జిల్లా సీపీఎం సీనియర్ నాయకుడు మట్టూరి భద్రయ్య చరిత్రలో ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచిపోతారని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న లింగాల గ్రామానికి చెందిన భద్రయ్య(91) శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించగా.. ఆయన భౌతికకాయంపై చారు. భద్రయ్య లింగాల సర్పంచ్‌గా, చెన్నూరు సొసైటీ చైర్మన్‌గా పని చేశారని, ప్రజా జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆచరణలో నమ్మినవారు పార్టీని వదిలి బయటకి పోలేరని తమ్మిని స్పష్టం చేశారు. సందర్భంగా మట్టూరి భద్రయ్య భౌతిక కాయంపై ఎర్రజెండా ఉంచి రెడ్ సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భారతి, సీపీఐ నాయకుడు ఆదినారాయణ, సండ్ర వెంకటవీరయ్య, అజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి భద్రయ్యకు నివాళులర్పించారు.

కారేపల్లిలో మదన్‌లాల్ పర్యటన

కారేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆదివారం పర్యటించారు. భాగ్యనగర్‌తండా గ్రామంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాంకుడోత్ జగన్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయన్ని మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ పరామర్శించారు. అనంతరం బస్వాపురం, కొత్తూరుతండా, సీతారాంపురం, పేరుపల్లి గ్రామాల్లో పర్యటించి, పలువురి కుటుంబాలను పరామర్శించటంతో పాటు, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు, రమేష్, వెంకన్న, బన్సీలాల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐలయ్య స్ఫూర్తితో పోరాటాలు

ఏన్కూరు: సీపీఎం సీనియర్ నాయకుడు కాసాని ఐలయ్య స్ఫూర్తితో భవిషత్ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం నేత బానోత్ బాలాజీ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం కాసాని ఐలయ్య సంతాప సభ నిర్వహించగా.. ఐలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరావు, రాములు, లెనిన్, వెంకటేశ్వర్లు, లక్ష్మా పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్


రైల్వే ఓవర్ బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్

మధిర: మధిర పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం ట్రాఫిక్ స్తంభించింది. రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాలు, ప్రజలు రాకపోకలు జరగకుండా రైల్వే అధికారులు నిలిపివేశారు. దీనికి తోడు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై గత 4 నెలలుగా మరమ్మతుల పనులు చేపడుతున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ స్తంభించడంతో గంటల కొద్ది ప్రజలు వేచిచూస్తున్నారు. పలుమార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా అనేకమున్నాయి. ఇప్పటికైన నత్తనడకన సాగుతున్న బిడ్జి పనులను త్వరగా పూర్తిచేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

‘లక్ష డప్పులు, వేయి గొంతుల’కు కదం తొక్కండి

బోనకల్: సుప్రింకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ.. ఈ నెల 7న లక్ష డప్పులు, వేయి గొంతుకల కార్యక్రమానికి కదం తొక్కాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. ఆదివారం మండలంలో మండల అధ్యక్షుడు తోటపల్లి చిన్న సైదులు అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సంఘం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిగడిచినా వర్గీకరణకు మద్దతు తెలపకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, హనుమంతరావు, వెంకటరత్నం, రవీంద్ర పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభకు గ్రామాల్లో దండోరా ప్రచారం..

కల్లూరురూరల్: ఈ నెల 7వ తేదీన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని కోరుతూ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు, వేలాది గొంతుకలు సమావేశానికి రావాలని కోరుతూ.. ఆదివారం కల్లూరు మండలంలోని బత్తుపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోరా కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో దండోరాతో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా చిన్నకోరుకొండి గ్రామ పంచాయతీలో గోడ పోస్టర్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు.

పోస్టర్లు ఆవిష్కరణ..


ప్రొద్దుటూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు భారీ సాంస్కృతిక ప్రదర్శన పోస్టర్లను ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ కోసం నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, ఎంఎస్‌పీ మండల ఉపాధ్యక్షుడు జాన్‌రాజ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఉపేందర్, ఎమ్మెస్పీ మండల అధికార ప్రతినిధి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.